

# పాడులోకం

కదురాడితేగాని కడుపాడదా కాపురానికి. అది దిక్కులేని సంసారము. ఆ రెండు రాటాలు ఆ ఒక్క మగకొయ్య ఆ సంసార జీవనోపాధికి ఆధారభూతాలు. పాపము కామయ్య ప్రతిరోజు తెల్లవారుజామున్నే లేచి, ఏ కూలికో నాలికో పోతే అతని పెళ్ళాము అతని అమ్మ ప్రొద్దున్నే లేచి రాటాలు పెట్టుకుంటారు. సందు సందున అన్నము అదీ వండుకొంటున్నా ఎడతెఱిపి లేకుండానే వడుకుతూ వుంటారు రాటాలు. ఎంత పొదుపుగా వాడుకొంటున్నా వాళ్ళకెప్పుడూ కరువే. వాళ్లున్న ఊరు ఒక పెద్ద బస్తీ అని చెప్పటానికి వీల్లేదు; కేవలము ఒక చిన్న గ్రామమూకాదు. ఒక మోస్తరు బస్తీగ్రామము లక్షాధికారులు ఆవూళ్ళోనే వున్నారు. బిక్షాధికారులు ఆవూళ్ళోనే వున్నారు. కామయ్య యిల్లు ఒక చిన్న పాక. సరిగ్గా విళ్ళయింటికి వందగజాల దూరాన్నే వుంది లక్షాధికారులైన భాగ్యాలరావుగారి భవనము. ఏరోజు కామయ్య కూలికి వెళ్లడో ఆమర్నాడు పస్తు వుండాల్సిందే. ఇట్లావుంది కామయ్య కాపురము. కామయ్య తల్లి వాళ్ళ స్థితిగతులు తలచుకొని కన్నీళ్ళెట్టుకోని రోజు లేదు. ఆమెకి ఎప్పుడూ అదే దిగులు. ఇంత దిక్కుమాలిన సంసారముగా చేశావేమని దేవుళ్ళని దూరని దినమే లేదు. ప్రొద్దస్తమానము పొలాల్లో పని చేసి రాత్రి కింత గంజినీళ్ళు త్రాగి కామయ్య కడుపులో కాళ్ళెట్టుకొని నిద్రపోతాడు. కాని కామయ్యగూడా తన కాపురాన్ని తల్చుకొని కన్నీళ్ళు పెట్టకపోడు. తానెంత కష్టపడ్డా రాత్రి యింటికివచ్చే సరికి తనకు దొరికేవి యిన్ని గంజనీళ్ళు. ఏమీ పనిచెయ్యకుండా పొట్ట కరగకుండా వున్న తోటి భాగ్యాలరావు అటువంటి సుఖభోజన మెందుకు చెయ్యాలి అని అప్పుడప్పు డాలోచిస్తూవుంటాడు. తానట్లా రాత్రింబగళ్ళు కష్టపడుతూ వుంటే భాగ్యాలరావట్లా కార్లో షికార్లు కొడతాడనే కామయ్య ఈర్ష్యపడతాడు. తానింత కష్టాలతో కాపురము చేస్తున్నా తోటి భాగ్యాలరావు పలుకరించడనే కామయ్య కోపానికి కారణము. పాపము తనకొడుకు కష్టాలుచూచిన భాగ్యాలరావుకి ఎప్పటికైనా జాలికలగదా అని కామయ్య తల్లి పరిచయం కొరకు రోజుకు పదిసార్లయినా వెళ్ళి వస్తుంది వాళ్లింటికి. ఈమెను చూట్టం—ఆలశ్యం లేనిపోని పని యేదో కల్పించి వెట్టిచాకిరీ చేయిస్తుంది భాగ్యాలరావు సతీతిలకము. పని చేయించుకోవటమే ఆమె వంతుగాని యింత వరకు కూరాకులోకి యింత వుప్పు పెట్టిన పాపాన పోలేదా మహా యిల్లాలు. ఇంటినిండా చచ్చినంత భాగ్యం; ఏమూలచూచినా మూలుగుతూ వుంటుంది సొమ్ము. ఇల్లు ఒక పెద్దకోట. ఇంట్లోవుండేదా ఆ రెండు పీనుగలు, జీతగా డొకడు. కారుకు డ్రైవరుకూడా దండగని తనే నడుపుకుంటాడు కారు భాగ్యాలరావు. ఎవ్వరైనా సోలెడుగింజలు అప్పివ్వమని వెళ్తే భాగ్యాల

శ్రీ పి. వి. సుబ్బారావు చౌదరి.

రావు భార్యా వెధవ మొఖంవేసి నిందుకున్నయి అనో లేకపోతే యియ్యడానికి జీతగాడులేడు ఎక్కడకు వెళ్ళాడనో ఏడుస్తుంది. నిండు వేసవిలో ఒక మహారణ్య మధ్యమున పిపాసా పీడితుడై ఎండమావులను చూసి భ్రమజెంది పరుగిడు పాంథునిమాదిరి పాపము కామయ్య తల్లి యీరోజైనా చేయదా సహాయం అనుకొంటూ ప్రతిరోజూ వెళ్తుంది భాగ్యాలరావు భార్యదగ్గరికి.

* * *

కాలప్రవాహము ఆద్యంతములు లేనిది. రాజులు, రంగప్పలు, పండితులు, పామరులు, సవర్ణులు, బీదలు, భాగ్యవంతులు అని విచక్షణ లేదుగదా దీనికి. ఎంత మంది కొట్టుకొని పోయిరి యీ కాలప్రవాహమున. అబ్బ! తలచుకుంటే గుండె బ్రద్దలై పోతుంది. ఎంత మంది ధర్మాత్ములను, ఎంతమంది త్యాగశీలలును, బీదల పాలిట దేవుళ్లైన పుణ్యాత్ములను ఎంతమందిని పొట్టున బెట్టుకుంది. నిన్న మొన్నటివరకు బాగా తిరుగుచున్న కామయ్యతల్లి నేడేమైంది. ఎందున కానరాదే. ఆమె నేడు కాలప్రవాహమున కొట్టుకొని పోవుచున్నది. గమ్యస్థాన మేదియో అమెకు తెలియదు. కాలప్రవాహపు తెప్పలచే ఎప్పుడు ఎక్కడ బైటకు కొట్టబడునో అదియే ఆమె గమ్యస్థానము. కామయ్యతల్లి జబ్బుపడ్డ రోజునుంచీ ముక్తిగాంచిన రోజువరకు పాపము కామయ్య, భార్యా పడిన అవస్థలు యింతింత గావు. తల్లి మరణావస్థలోనున్నను కామయ్య కూలికిపోక గత్యంతరములేదు. ఇక అతనిభార్య ప్రొద్దస్తమానము అత్తకు సేవజేస్తూ కూర్చుండేది. రెండుమూడుసార్లు అత్త పంపిస్తే వెళ్ళింది భాగ్యాలరావుగారింటికి ఏమైనా సహాయం చేయక పోతారా అని. చివరకు వెద్యుని సహాయమైనా చేసిపెట్టండితల్లీ అని ఆ మహాయిల్లాలిని మ్రొక్కుకుంటే "ఏమిటీ మీ దండోరా మాబాగావుంది. వైద్యులకు డబ్బు పెట్టలేక మేము చస్తూవుంటే పైగా యిదొకటా" అని కసరి పంపించింది మూడోసారి మళ్ళా గడప త్రొక్కకుండా. సరియైన వైద్యసహాయం దొరక్కపోవటం చేత, తీసుకు తీసుకొని, నానావస్థలు పడి కామయ్య తల్లి జీవాత్మ చివరకు పరమాత్మలో కలిసిపోయింది.

"మలమల మాడు పొట్ట తెగమాసిన బట్టకలంత వెట్టగా విలవిల యేడ్చుచున్న" ఒక హరిజనుడు కడుపుమంట ఆర్చుకొనేది యెలారా దేవుడా అని వెస్తూవుంటే "ఊర్జిత హరిజనోద్ధారణంబు" అంటూ ఒక ఉద్ధారకుడు అస్పృశ్యతానివారణా బద్ధకంకణుడో కాయన ఎదురై ఆ మాలవానిని భుజముమీద చేయివేసి దేవాలయములోనికి తీసుకొనివెళ్లి దేవునకు మ్రొక్కమన్నాట్ట. 'ఆకలిబాధ ఎట్లా స్వామీ నివారణ చేందేది' అని అడిగితే ఆ మహానాయకుడు "రోజూ యిట్లాగే వచ్చి దేవాలయములో దేవునికి దణ్ణం పెట్టి పోతూ వుండు, దేవుడే పెట్టుతాడు అన్నం" అన్నాట్ట మహా త్యాగమూర్తి. దేవుడు పుట్టించాడు గనుక మనము పుట్టేం, దేవుడు బ్రతకమన్నాడు గనుక బ్రతుకుతాము అనే నిరర్థక జీవి భాగ్యాలరావు—కట్టుకున్నాడు కంకణం చివరకి హరిజనోద్యమములో అస్పృశ్యతా నివారణమంటూ. పల్లెపల్లెకు తిరిగి బోధిస్తున్నాడు గాంధీగారి యీ పరమశిష్యుడు. అవర్ణులని సవర్ణులని భేదములతో దేశము హీనదశకు వస్తూవుంది. కాబట్టి అస్పృశ్యతా నివారణ సంఘములు అవుసరమంటాడు. వీటివలననే విశ్వమానవ సౌభ్రాతృత్వము స్థాపింపగలమంటాడు. తిండి లేని వారి కష్టాలు చూస్తూ వారికి తిండినిగురించి ఆలోచించవద్దా అంటే అదియిప్పుడు చర్చింపవలసిన సమస్య గాదంటాడు. "అంటరానివారు" అంటూ లేకుండా అందరు ఒకటై దేశోద్ధరణము చేయాలంటాడే గాని తాను అట్లా సుఖజీవనము చేస్తూ ప్రక్కవారు తిండి లేక చస్తూవుంటే సహాయం చేద్దామని తోచదా విశ్వమానవ సౌభ్రాతృత్వ స్థాపనా బద్ధకంకణునికి. 'బీదవారు' అనే పదమంటేనే అసహ్య పడతానంటాడే గాని బీదతనము లేకుండా చెయ్యాలని తోచదా వెఱ్ఱిబుర్రకు. విశ్వమానవ సౌభ్రాతృత్వమంటే అస్పృశ్యతా నివారణమే అనుకుందా మట్టిపుచ్చె.

* * *

'గోరుచుట్టుపై రోకటి పోటన్నట్లు కష్టపడే వారికే కష్టాలు కలుగజేస్తావు గదా లీలా మానుషవిగ్రహా, సుఖపడేవారికి కష్టాలంటే ఎట్లా వుంటవో ఎరుగనివ్వవు గదా! ఇదేమి స్వామీ అంటే యివి

నా లీల లంటావు. అబ్బ ఎంత కఠిన హృదయుడవు. కష్టపడే వారికే కష్టాలు కలుగచేస్తావు యిదెక్కడి పరిపాలన దేవరా అంటే కష్టాలలోనే జీవిత రహస్యము అర్థము చేసుకొనేది. కష్టాలలోనే నేనున్నానంటావు. ఇదెక్కడి మెట్టవేదాంతమయ్యా నిర్వికారా! కష్టములలో సుఖమున్నదను వారును చీకటిలో యానందమున్నదను వారును ఎట్టి వారో గదా?

పాపము కామయ్య పదిరోజుల్నుంచి జబ్బు పడ్డాడు. తల్లిగతించిన నాటినుంచీ ఏదో అస్వస్థతగానే ఉంటున్నాడు. మరీ పదిరోజులనుంచీ లేవడానికి గూడా శక్తిలేక ఉన్నాడు. కామయ్య భార్యా పాపము కంటికి కడివెడుగా ఏడుస్తుంది. కాని ఆర్చేవారా, తీర్చేవారా! భాగ్యవంతులకు గనుక ఏమాత్రమైనా అస్వస్థతగలిగితే పరుగెత్తుతారేగాని కామయ్య ఎందుకు పడతాడు వాళ్ళ దృక్పథములో? రాత్రి అయింది. అంతా నిశ్శబ్దముగా వుంది. కామయ్య యింట్లో దీపము మినుమినుక్కు మంటుంది. కామయ్య భార్య కంటికి మంటికి ఏకధారగా ఏడుస్తూవుంది. ఆ పండు వెన్నెలలో కష్టజీవి కామయ్య వానిభార్యా తప్ప అందరు ఆనందమయులై నిద్రపోతున్నారు. జేరాజు తన స్వచ్ఛంద జ్యోత్స్నలను లోకముపై వెదజల్లుచున్నాడు. భోగలాలసులు కామినీదృఢ పరిష్వంగానందమయులై ఉన్నారు. పగలంతా కష్టపడ్డ జీవులు కౌముదీశీతలచ్ఛాయలకు వడవడ వణకుచు పంచలలో పండిరి. పాడువెన్నెలా! నీవు అమృతములో హాలాహల మున్నదని చాటుచున్నావుగదా. కామయ్య పాపము మూలుగుతూ "ఇదిగో! ఏమేయ్! అబ్బా! నేను బ్రతకను. అమ్మా...ఊ...ఊ...ఏమిబాధే! నరకబాధ!! దిక్కులేని సంసారము... ...దేవుడా తల్చుకుంటే సరి కడుపుమంట...ఊ.. కడుపు...కోత ...! ఇకనే పోతున్నా. ఎట్లా బ్రతుకుతావో పిచ్చి ముండవు. ఊ...ఇస్" పాపము కామయ్యభార్య భోరున ఏడ్వసాగింది." ఊరుకోవే పిచ్చికొయ్యా. ఊరుకో ఏడిచి ఏంజేస్తావు. పోయే మొగుడికి అడ్డు పడతావో...ఇస్...అబ్బా! నీకర్మం. ఈ కాసేపేనా ఏడువబోకు ఎప్పుడూ కష్టాలే! నన్ను...సుఖం...గా చావనియ్యి......ఊ...యిదుగో యిట్లారా" అంటూ కామయ్య, భార్యను కరస్పర్శచేస్తూ బుజ్జగించాడు. పాపము యిద్దరి శరీరాలు పులకించాయి. కామయ్య భార్య శరీరం గజగజవణకి కొయ్యబారింది. కామయ్య ఆపుకోలేక కన్నీరు నించుకొన్నాడు. దాంతో అతనిభార్యా చేయంతా తడిసిపోయింది. ఆ ఒక్కక్షణమే వారి జీవిత కాలములోని ఆనందమయ సమయము. అర్ధరాత్రి దాటిననుంచీ కామయ్యకు సంధించింది. పిచ్చి పిచ్చిమాటలు మాట్లాడ సాగించాడు. కామయ్య భార్యకు అంతా అయోమయంగా వుంది. తన్ను తానే పీక్కొంటుంది. గాజులన్నీ పగుల గొట్టుకుంది. కామయ్య మీదపడి అతన్ని మరీమరీ హత్తుకుంటూ పీకుతూవుంది. కామయ్య జీవితము తెల్లవారిందని చాటుచూ వెలవెలబోయిన మోముతో ప్రకృతి తెల్లవారింది. కామయ్య చచ్చిపోయాడని నిమ్మళముగా ఊరంతా పాకింది. చుట్టుపట్ల వాళ్ళంతా చూట్టానికి వచ్చారుగాని తన హోదాకు లోటని ఒక్క భాగ్యాలరావు మాత్రం రాలేదు. ఉదయం పదకొండు గంటలు కావచ్చింది. అంతవరకు కామయ్య శవదహన సంస్కార ప్రయత్నాలేమీ జరగలేదు. చివరకు ఒక పుణ్యాత్ముడు కట్టెపేళ్ళు కొన్ని సంపాదించి తెచ్చాడు. అవి చాలవు మరికొన్ని కట్టెపేళ్ళు కిరసనాయిలుడబ్బా ఒకటి దయచేయించాలి అని భాగ్యాలరావునిప్రార్థించమని పంపించారా కట్టెలు తెచ్చిన పుణ్యాత్మున్ని. ఆసమయాన ఏదేవదేవుడు ప్రవేశించాడోగాని భాగ్యాలరావు బుర్రలోన, అడిగినదే సమయంగా దయచేయించాడు కట్టెలు, కిరసనాయిలు, కామయ్య దహనానికి అహో. పుణ్యాత్ముడు!! బ్రతికియుండి కష్టపడుచున్న జీవికి సాయంచేద్దామని తోచకపోయినా చచ్చిన శవానికి దానం చేశాడు దానకర్ణుడు! కామయ్య శవదహనం చేసేసరికి సాయంత్రమైంది.

విచిత్రము. కామయ్య శవదహనానికి భాగ్యాలరావు గూడ వెళ్లాడు స్మశానానికి. వీళ్లు కామయ్య శవాన్ని దహనం చేస్తూ ఉండగా ఎవరో ఒక సన్యాసి ప్రక్కగా పోతూ యిట్లా పాడుతున్నాడు.

"దేశమంటే మట్టిగాదోయ్!

దేశమంటే మనుజులోయ్!!"

పదేపదే పాడిందే పదిసార్లు పాడుకొంటూ ప్రక్కనున్న తోపులో గుండా అదృశ్యుడైపోయాడా సన్యాసి. ఆనాటి రాత్రి కామయ్య భార్యకు ప్రక్కయింటివాళ్లు భోంచేయ బెట్టారు. మర్నాడు ప్రొద్దున్నే కామయ్య భార్య కనపడడం లేదని పుకారు బుట్టింది. ఎక్కడకు పోయిందో! ఏమైపోయిందో!! నిర్భాగ్యగాలు! కాదుకాదు. అదృష్టవంతురాలు!! ఈ తుచ్ఛ ప్రపంచాన్ని రోసి వెళ్లి వుంటుంది. బహుశ యింకొకటి నిర్మించుకుంటానికి.


అజ్ఞాతపాండవము

దొరతనమువారిచే పఠనీయగ్రంథముగా అంగీకరించబడినది ప్రతి 1-కి రు 0-10-0

సహదేవ పశుచికిత్స

(తాత్పర్యసహితము)

పశువులకు గలుగుసకలవ్యాధులకు చికిత్సలు తేటతెల్లముగా తెలుపబడినవి. ప్రతి 1-కి రు 0_2_0

ఐరోపాఖండ యుద్ధచరిత్రము

భూగోళచిత్ర భావపట సహితము

1—వ భాగం 0—8—0

2—వ భాగం 0--12—0

సోదరప్రేమ లేక మాధవరావు

నీతిదాయకమగు నవల.

దొరతనమువారిచే పాఠశాలలకు అంగీకరింపబడినది.

ప్రతి 1-కి 0—10—0

ఆనందబోధిని ఆఫీస్,

సౌకారుపేట, మదరాసు.

కామశాస్త్రములు—అంతఃపుర కాంతలు.

కామశాస్త్రములను పూర్వము అంతఃపుర కాంతులు కూడ పఠించేవారు. అటువంటి అవసర గ్రంథములు నేడు అందరును చదువుటకు అవకాశ మేర్పడినది. సచిత్రములతో శులభశైలిని వ్రాయబడిన రసవత్తర శాస్త్ర గ్రంథములు.

సతీపతి కుతూహల రహస్యములు వెల రు. 2-0-0

దాంపత్య రహస్యములు వెల రు. 1-0-0

మన్మథ సామ్రాజ్యము వెల రు. 0-8-0

పడకటింటి రహస్యములు వెల రు. 0-8-0

స్త్రీ పురుష ప్రేమ రహస్యములు వెల రు. 1-0-0

పడకటింటి ముచ్చటలు వెల రు. 0-8-0

శరీరమర్మశాస్త్రము వెల రు. 1-0-0

(పోస్టు ఖర్చులు ప్రత్యేకము)

ఆర్యన్ బుక్ డిపో,

ట్రిప్లికేన్, మదరాసు.